సాక్షి
విజయనగరం
సోమవారం । 1 । మే । 2023



'ప్రత్యేక' ప్రోత్సాహం

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా మానసిక, శారీరక థెరపీ అందిస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. -8లో



'ఆట'ందం నీ హద్దురా..!

వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులకు పండగే. పుస్తకాలతో కుస్తీపట్టిన వారు ఒక్కసారిగా రెక్కలు వచ్చి సంతోషంతో విహరించనున్నారు. -8లో



శంకరాచార్యుల సాహిత్యం ఉపయోగం

నేటి తరానికి శంకరాచార్యుల సాహిత్యం ఉపకరిస్తుందని శ్రీ సూర్యసదన ఆస్థాన పండితుడు డాక్టర్ చంద్రశేఖరం పేర్కొన్నారు. -8లో

న్యూస్‌రీల్

గంగానది పుష్కరాలకు ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



జెండా ఊపి ప్రత్యేక సర్వీసును ప్రారంభిస్తున్న ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: పవిత్ర గంగానది పుష్కరాలకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక బస్ సర్వీసును ప్రజా రవాణాధికారి కె.శ్రీనివాసరావు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రత్యేక సర్వీసు ఆదివారం బయలుదేరి నేరుగా వారణాసి వెళ్లి మే 3వ తేదీన తిరిగి విజయనగరం చేరే విధంగా నాలుగు రోజుల పుష్కర యాత్రను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజరు జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు ఆదినారాయణ, ఎస్‌టి దుర్యోధన, సూపర్‌వైజర్లు అశోక్, శ్యామలరావు పాల్గొన్నారు.

'నాలుగురెక్కల పిట్ట' పుస్తకావిష్కరణ



నాలుగురెక్కల పిట్ట పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో లండ సాంబమూర్తి కవిత్వం 'నాలుగు రెక్కల పిట్ట' పుస్తకావిష్కరణ గురజాడ స్వగృహంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. గురజాడ వేసిన అభ్యుదయ బాటను మరింత వెలుగులతో శ్రీశ్రీ వెడల్పు చేసి ఆధునిక సమాజానికి అందించారని అధ్యక్షత వహించిన చీకటి దివాకర్ పేర్కొన్నారు. తెలుగు ప్రొఫెసర్ ఉదయ్‌కిరణ్ పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ప్రముఖ యువకవి బాల సుధాకర మౌళి కవితలను సమగ్రంగా విశ్లేషించి కవి ప్రతిభను ప్రశంసించారు. ఉత్తరాంధ్ర ప్రముఖ కవి కంచరాన భుజంగరావు, పాయల మురళీకృష్ణ, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల న్యాయనిర్ణేతగా విజయ్‌కుమార్



రాజాం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మే నెల 5 వరకూ జరగనున్న ఏపీ సీఎం కప్ పోటీలకు బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో న్యాయనిర్ణేతగా పాగిరి జెడ్పీ హైస్కూల్ పీడీ పి.విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో 14 రకాల పోటీలు తిరుపతి వేదికగా జరుగుతున్నట్లు విజయ్‌కుమార్ వెల్లడించారు. మొత్తం 5500 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరౌతున్నారని తెలిపారు. శాప్ వైస్‌ఛైర్మన్ హర్షవర్ధన్‌తో కూడిన కమిటీ ఈ పోటీలకు సంబంధించిన న్యాయనిర్ణేతగా ఎంపికలో తనను సెలెక్ట్ చేసిందని, ఈ పోటీలకు జడ్జిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని వెల్లడించారు.

పోస్టల్ సంఘాల గుర్తింపు పునరుద్ధరించాలి

విజయనగరం టౌన్: అనవసర కారణాలతో రెండు పోస్టల్ ఉద్యోగ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపును రద్దు చేయడం అప్రజాస్వామికమని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి ఆర్.అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తపాలా శాఖకు చెందిన ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతంపైన సభ్యుల బలం ఉందని తెలిపారు. కనీసం ఐదు శాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుపై గుర్తింపును రద్దు చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. జీవిత బీమా సంస్థలో 80శాతం పైగా సభ్యత్వం ఉన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సోదర పోస్టల్ సంఘాల గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. వెంటనే ఆ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని కోరారు.

నేటి నుంచి శిక్షణ

విజయనగరం పూల్ బాగ్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు గురుకులాల జిల్లా సమన్వయ కర్త బి.చంద్రావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో జోగింపేట, గరుగుబిల్లి, విజయనగ రం జిల్లాలో బాడంగి, నెల్లిమర్లలో కేంద్రాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆయా కళాశాలల సబ్జెక్ట్ టీచర్లను, ఇతర సిబ్బందిని నియమించామని తెలిపారు.

గంగపుత్రులకు
జెట్టీ వరం

- చింతపల్లి తీరంలో సాకారం కానున్న ఫ్లోటింగ్ జెట్టీ
- 3న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ
- రూ.23.73 కోట్లతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణానికి శ్రీకారం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేల మందికి ఉపాధి
- ఇప్పటికే రూ.25 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

గంగపుత్రుల కల నెరవేరనుంది. కడలిని నమ్ముకున్న వారి జీవితాన్ని మలుపుతిప్పే ఒక గొప్ప వరాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా మత్స్య ఉత్పత్తిపై ఆధారపడిన దాదాపు 20 వేల మందికి ఉపాధి కల్పించేలా పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. మే 3వ తేదీన స్వయంగా ముఖ్యమంత్రి తన చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నారు. ఇప్పటికే రూ.25 కోట్ల నిధులను ఇందుకోసం ప్రభుత్వం విడుదల చేసింది. అందులో సుమారు రూ.23.73 కోట్లతో దాదాపు ఆరెకరాల విస్తీర్ణంలో నిర్మాణమయ్యే ఈ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ మత్స్యకారులకే కాకుండా చింతపల్లి ప్రాంతం ఆర్థికంగా, పర్యాటకంగా అభివృద్ధికి దోహదపడనుంది.

విజయనగరం జిల్లాకు సుమారు 21.44 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. కానీ ఈ తీరంలో చేపల వేట కలిసిరాక, తుపాను వస్తే తమ బోట్లుకు రక్షణ లేక మత్స్యకారులు అన్నివిధాలా నష్టపోతూనే ఉన్నారు. విధిలేని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాలకు పొట్ట చేతబట్టుకొని వలసపోతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వారికి అండగా నిలబడుతున్నారు. వేట నిషేధ కాలంలో భృతిని పెంచారు. ప్రమాద బీమా మొత్తాన్ని రెట్టింపు చేశారు. ఇక వారి కష్టాలను శాశ్వతంగా గట్టెక్కించేలా ఫ్లోటింగ్ జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను చింతపల్లి తీరంలో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించడానికి ఆర్నెల్ల క్రితమే పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అందులో సుమారు రూ.23.73 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు.

వలసలకు చెక్ పెట్టేలా...

పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 19 మత్స్యకార గ్రామాలకు సుమారు 12 వేల మంది మత్స్యకారులు చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్నారు. వారు తెచ్చిన చేపలను స్థానికంగానూ, జిల్లాలో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తూ మరో ఎనిమిది వేల మంది వరకూ జీవనం సాగిస్తున్నారు. అయితే తుపానుల సమయంలో బోట్లు మరమ్మతులకు గురి కావడం, వేట తర్వాత వాటిని బోట్లను ఒడ్డుకు చేర్చడానికి ప్రతిరోజూ వ్యయప్రయాసలకు గురికావడం, మరోవైపు సముద్రంలో మత్స్యరాశి తగ్గిపోతుండటం, బోట్ల నిర్వహణ అధికమవడం తదితర కారణాలతో దాదాపు రెండు వేల మంది వరకూ మత్స్యకారులు గుజరాత్, గోవా, కర్ణాటక, కేరళ తీర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. తమను ఈ కష్టాల నుంచి గట్టెక్కించాలని మత్స్యకారులు గత ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా అరణ్యరోదనే అయ్యింది. ఈ నేపథ్యంలోనే వారి సమస్యలను తీర్చుతానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోలోనూ మత్స్యకారులకు పలు వరాలు ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ అమలు చేస్తున్నారు.

తీరంలో కష్టాలకు ఇక 'లంగరు'

పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని మత్స్యకారులు 417 సంప్రదాయ పడవలను, 711 మోటరైజ్డ్ బోట్లను ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. వాటన్నింటినీ లంగర్ వేసుకోవడానికి చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఉపయోగపడుతుంది.తుపానుల సమయంలోనూ అవి సురక్షితంగా ఉంటాయి. అంతేకాదు మత్స్యకారులు వాటిని సముద్రంలోకి తీసుకెళ్లి మళ్లీ వేట తర్వాత లంగరు వేసుకోవడం ఎంతో సులభమవుతుంది. వారికి వ్యయప్రయాసలు తప్పుతాయి.



చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించదలచిన ప్రదేశం

సురక్షిత ప్రాంతం చింతపల్లి తీరం

బంగాళాఖాతంలో తరచుగా సంభవించే తుఫానుల ప్రభావంతో పెద్దఎత్తున అలలు ఎగిసిపడుతూ ఉంటాయి. వాటి తాకిడితో సాధారణ జెట్టీ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అలాగాకుండా అలలతో పాటు కదులుతూ ఉండే ఫ్లోటింగ్ జెట్టీ నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. నది లేదా గెడ్డ సముద్రంలో కలిసే మొగ ప్రాంతం ఫ్లోటింగ్ జెట్టీ అనుకూలంగా ఉంటుంది. ఈ దృష్ట్యా జిల్లా తీరంలో మూడు ప్రాంతాలను పరిశీలించిన నిపుణులు చివరకు చింతపల్లి తీరాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ ఫ్లోటింగ్ జెట్టీతో పాటు మత్స్యకారుల కోసం కమ్యూనిటీ హాల్, చేపల వేలం కేంద్రం, వలలు మరమ్మతు చేసుకోవడానికి వీలుగా భవనం, కోల్డ్ స్టోరేజీ కూడా నిర్మించనున్నారు. అందుకోసం సర్వే నంబరు 104లోని ఆరు ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది.

పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణ



ఉమ్మడి విజయనగరం జిల్లాలో చింతపల్లి బీచ్ ఒక్కటే సముద్రతీర పర్యాటక ప్రాంతం. ఇక్కడ లైట్ హౌస్ కూడా ఉంది. జాతీయ రహదారితో పాటు త్వరలోనే సాకారం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోనే ఉంది. ఫ్లోటింగ్ జెట్టీ సాకారమైతే పర్యాటక రంగంలోనూ అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంది. స్కూబా డైవింగ్‌కు అనువైన ప్రాంతంగా గుర్తించారు.

దశాబ్దాల కల నెరవేరుతోంది



ఒక జెట్టీ ఉండాలనే మా దశాబ్దాల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చుతోంది. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో దాదాపు 20 వేల మందికి చింతపల్లి ఫ్లోటింగ్ జెట్టీ ఒక వరమే.

– మైలపల్లి హరి, మత్స్యకారుడు, చింతపల్లి

మా మత్స్యకారుల కష్టాలు గట్టెక్కుతాయి...



వేట చేసిన తరువాత బోట్లును ఒడ్డుకు చేర్చడానికి ఇబ్బందిపడుతున్నాం. ప్రతి రోజు మాకు ఇది ప్రహసనమే. బోట్లు దెబ్బతింటున్నాయి. నిర్వహణ ఖర్చు పెరిగిపోతోంది. మా మత్స్యకారులను కష్టాల నుంచి గట్టెక్కించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ మంజూరు చేశారు. ఆయనే శంకుస్థాపన చేయడానికి రావడం మాకెంతో సంతోషం.

– మేడ అమ్మోరు, మత్స్యకారుడు, చింతపల్లి

మత్స్యకారుల జీవితాల్లో వెలుగు...



గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశాం. ఏ ముఖ్యమంత్రీ మత్స్యకారులను పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను మంజూరు చేశారు. ఇప్పుడు చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి నడుంబిగించారు. మా మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపారు.

– బర్రి చినఅప్పన్న, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

నేటి నుంచి పైడితల్లి అమ్మవారి పండుగ

- సిరిమానోత్సవం రేపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామ పెద్దలు



శ్రీ పైడితల్లి అమ్మవారు

తెర్లాం:

మండలంలోని ఆమిటి గ్రామ దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. 14ఏళ్ల క్రితం గ్రామంలో అమ్మవారి పండుగను జరుపుకున్నారు. మళ్లీ ఇప్పుడు పైడితల్లి అమ్మవారి పండుగను జరిపేందుకు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఇటీవల నిర్ణయించారు. శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగను ఆమిటితో పాటు సింగిరెడ్డివలస, సీతారాంపురం, బొంగుపేట గ్రామాల ప్రజలు జరుపుకోనున్నారు. ఆయా గ్రామాల్లో కొద్ది రోజులుగా అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. పైడితల్లి అమ్మవారి పండుగలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయానికి గ్రామానికి చెందిన మహిళలు ప్రతీరోజూ వెళ్లి పూజలు చేస్తున్నారు. అమ్మవారి పండుగకు వేల సంఖ్యలో భక్తులు హాజరు కానుండడంతో గ్రామ పెద్దలు, ప్రజలు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు నిర్వాహక కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో చేశారు.

సీఎం సభాస్థలి ఏర్పాట్ల పరిశీలన

భోగాపురం: భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3వ తేదీన శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఎ.రావివలసలో నిర్వహించే బహిరంగ సభ ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లును సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త తలశిల రఘురాం, జేసీ మయూర అశోక్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. హెలిప్యాడ్, ట్రాఫిక్, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీఎం సభాస్థలిలో జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

- బంగారు చీర, వజ్రకిరీట ధారణలో అమ్మ దర్శనం
- అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ఎమ్మెల్యే కోలగట్లకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: కన్యకాపరమేశ్వరి అమ్మవారు జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు ఆదివారం నిర్వహించారు. అమ్మవారు బంగారు చీర, వజ్రకిరీటం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏపీ శాసనసభ ఉప సభాపతి, ఆలయ గౌరవ అధ్యక్షుడు కోలగట్ల వీరభద్రస్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, దేవస్థానం అధికారులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కలశ పూజ, హోమంలో పాల్గొన్నారు. 108 కలశాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు, ఊంజల్ సేవ, మహాహారతి అనంతరం సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రతినిధులు కట్టమూరి మురుగన్, వెంకటరావు, నరసింగరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగం పెరిగినా...
నిరంతరాయంగా విద్యుత్

సూర్య భగవానుడు భగభగమంటున్నాడు. ఎండ వేడిమిని తాళలేని ప్రజలు ఉపశమనం పొందేందుకు రకరకాల మార్గాలు వెతుకుతున్నారు. ఉన్నంతలో ఉక్కపోత నుంచి తప్పించుకునేందుకు ప్రజలు ఇళ్లల్లో ఫ్యాన్లు నుంచి ఏసీల వరకు చెప్పుకోదగ్గ స్థాయిలోనే వినియోగిస్తున్నారు.

- కోతలు లేకుండా విద్యుత్ సరఫరా
- రోజుకి 10.8 మిలియన్ యూనిట్ల వినియోగం
- డిమాండ్ కంటే రోజుకి 80 లక్షల యూనిట్ల పెరుగుదల
- జిల్లాలో 7 లక్షలకు పైగా కనెక్షన్లు



అయ్యన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్

విజయనగరం ఫోర్ట్: వేసవిలో ఓ వైపు ఎండ వేడిమి.. మరో వైపు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వంటి వాటిని అధికంగానే వినియోగిస్తున్నారు. ఫలితంగా విద్యుత్ వినియోగం ఒక్కసారి గణనీయంగా పెరిగింది. ప్రతి ఇంటిలోను రోజులో 10 నుంచి 20 గంటల పాటు ఫ్యాన్లు, ఏసీలు వంటి వాటిని వాడుతున్నారు. విద్యుత్ వినియోగం పెరిగినప్పటికి ప్రభుత్వం వినియోగదారులకు కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందిస్తుంది. మార్కెట్‌లో విద్యుత్ యూనిట్ ధర అధికంగా ఉన్నప్పటికి కొనుగోలు చేసి అన్ని వర్గాల వారికి విద్యుత్‌ను అందిస్తుంది. దీంతో జనం ఊపిరి పీల్చుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేసవి వచ్చిందంటే చాలు ఇష్టానుసారంగా కోతలు విధించేవారు. ఈఎల్ఆర్ పేరిట పవర్ కట్ విధించేవారు. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎటువంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తోంది. దీంతో జనం ఊపిరి పీల్చుకుంటున్నారు.

డిమాండ్ కంటే పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాకు సంబంధించి డిమాండ్ కంటే వినియోగం పెరిగింది. రోజుకు సగటున 10.8 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం అవుతుంది. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల విద్యుత్ వినియోగం మరింతగా పెరిగింది. ప్రస్తుతం రోజుకి 80 లక్షల యూనిట్లు విద్యుత్ వినియోగం పెరిగింది. వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు అన్ని వర్గాల ప్రజలు విద్యుత్‌ను తెగ వాడేస్తున్నారు. ఉష్ణోగ్రతలు 39, 40 డిగ్రీలు నమోదు కావడంతో ఇళ్లలో సైతం ఉండలేని పరిస్థితి. దీంతో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగింది.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

కేటగిరి	కనెక్షన్లు
1	6,56,558
2	65,194
3	2,822
4	14,168
5	7,71,156

వినియోగం పెరిగింది

జిల్లాలో విద్యుత్ వినియోగం ప్రస్తుతం పెరిగింది. అయినా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. విద్యుత్ కోతలు విధించే పరిస్థితి కూడా లేదు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం.

– పి.నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ



క్లుప్తంగా

బాణసంచా తయారీ స్థలం పరిశీలన



పేలుడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ అప్పారావు, డీటీ సూర్యనారాయణ

గుర్ల: మండలంలోని గవిడి పేట వద్ద బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించిన స్థలాన్ని ఆర్డీఓ అప్పారావు ఆదివారం పరిశీలించారు. పేలుడుకు గల కారణాలను డీప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. కూలిపోయిన షెడ్లు, భవనాలను పరిశీలించారు. అలాగే డీఎస్పీ మోహన్ రావు కూడా సంఘటన స్థలానికి వచ్చి పరీక్షించారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆర్‌డీఓ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి



గాయపడిన జగన్నాథమ్మ

సీతానగరం: మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిలో హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం రోడ్డు దాటుతుండగా ఓ మహిళను లారీ ఢీ కొనడంతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. అప్పయ్యపేట గ్రామానికి చెందిన కె జగన్నాథమ్మ(70) సీతానగరం నుంచి స్వగ్రామం వెళ్లడానికి రోడ్డు దాటుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రురాలిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదుచేశారు.

విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన రాజుకుమారి (ఫైల్)

భామిని: మండలంలోని నేరడి-బి గ్రామానికి చెందిన విద్యార్థిని అడ్డసారి రాజుకుమారి(15) ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం ఇంట్లో ఎలుకలు మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా కుటుంబసభ్యులు భామిని పీహెచ్‌సీకి, పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ విద్యార్థిని మృత్యువాత పడినట్లు కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. కొత్తూరు ప్రభుత్వ వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న రాజుకుమారి ఇటీవల జరిగిన పబ్లిక్ ఎగ్జామ్స్ సక్రమంగా రాయలేకపోయానని మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి అడ్డసారి మహాలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వై.అమ్మన్‌రావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పేరెంట్స్ మీటింగ్‌లో గందరగోళం

చీపురుపల్లిరూరల్: మండలంలోని కర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో గందరగోళం నెలకొంది. పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ జరుగుతున్న క్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది యువత, పిల్లల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల తీరుపై మండిపడ్డారు. ఉపాధ్యాయులుగా ఇలాంటి నడవడిక మంచిది కాదని, తీరు మార్చుకోవాలని గట్టిగా చెప్పారు. పాఠశాల వద్ద గొడవ జరుగుతున్న క్రమంలో తెలిసిన సమాచారం మేరకు చీపురుపల్లి పోలీసులు వెళ్లి గొడవను నియంత్రించి ఉపాధ్యాయులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లగా ఎస్సై సన్యాసినాయుడు కౌన్సెలింగ్ చేసి పంపించారు. ఇదే విషయమై హెచ్‌ఎం కామేశ్వరి మాట్లాడగా ఈ విషయం ఇంతవరకు తన దృష్టికి రాలేదని, ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని శనివారం కొట్టారని, విద్యార్థినుల పట్ల ఒక ఉపాధ్యాయుడు మాట్లాడే భాష బాగాలేదని పేరెంట్స్ మీటింగ్‌లో తనకు ఫిర్యాదు చేశారని, ఇక ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 425.00
విజయనగరం	రూ. 429.00
శ్రీకాకుళం	రూ. 429.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,930-00
బంగారం(22సి. 10గ్రా.)	55,850-00
వెండి (కిలో)	80,400-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹ 234

'ప్రత్యేక' ప్రోత్సాహం



భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు శిక్షణ ఇస్తున్న ఐఈఆర్‌టీలు

- విద్య, ప్రయాణం, సంరక్షకుల భత్యాల చెల్లింపు
- జిల్లాకు విడుదలైన మొత్తం రూ.47,07,000
- అర్హుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ
- జిల్లాలో 27 భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ

జిల్లాలో భవిత కేంద్రాల వివరాలు..

జిల్లాలో గుర్తించిన విభిన్న ప్రతిభావంతులు	: 3786 మంది
పాఠశాలల్లో, భవిత కేంద్రాల్లో ఉన్నవారు	: 3428 మంది
మొత్తం కేంద్రాలు	: 27
సేవలు పొందుతున్న వారు	: 1824 మంది
ఫిజియోథెరపిస్టులు	: 9 మంది
ఐఈఆర్‌టీలు	: 43 మంది
ఆయాలు	: 27 మంది



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యురాలు

చీపురుపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా వారికి మానసిక, శారీరక థెరపీ అందిస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. మాటలు రాని, మానసికంగా ఎదుగుదల లేని పిల్లలు ఇళ్లలోనే ఉండి మరింత మానసికంగా కుంగిపోకుండా వారిని భవిత కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ ఆటపాటలు, ఇతర పరికరాలతో వారిలో పరివర్తన తీసుకొచ్చేలా సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాటు భవిత కేంద్రాలకు ఫిజియోథెరపిస్టులను నియమించి శారీరక థెరపీ అందిస్తున్నారు. మరికొంత మంది ఇల్లు కదలలేని పిల్లలకు వారానికోసారి వారి ఇళ్లకే సిబ్బంది వెళ్లి అక్కడ థెరపీ సేవలు అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులకు కూడా ప్రభుత్వం అలవెన్సులు కల్పిస్తోంది. తాజాగా జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాల ద్వారా సేవలు పొందుతున్న 1824 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంరక్షకులకు రవాణా, చదువుకు సంబంధించిన అలవెన్సులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు 1824 మందికి రూ.47,07,000 నిధులు అర్హుల ఖాతాల్లోకి జమ చేసింది.

ప్రోత్సాహకాల విడుదల ఇలా..

జిల్లాలో 27 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా 1824 మంది విభిన్న ప్రతిభావంతులు సేవలు పొందుతున్నారు. వారికి ట్రాన్స్‌పోర్టు, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, బాలికల ప్రత్యేక విద్య, స్టైపెండ్ పేరుతో ప్రోత్సాహకాలను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో భాగంగానే రవాణా అలవెన్స్‌ను జిల్లాలోని 379 మందికి నెలకు రూ.3000 చొప్పున, ఎస్కార్ట్ అలవెన్స్‌లో భాగంగా 298 మందికి రూ.3 వేలు చొప్పున, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్ 270 మందికి రూ.3 వేలు చొప్పున, రీడింగ్ అలవెన్స్ 112మందికి రూ.3 వేలు చొప్పున, గర్ల్ స్టైపెండ్ కింద 765 మందికి రూ.2 వేలు చొప్పున నిధులు విడుదలయ్యాయి.

అర్హుల ఖాతాల్లో అలవెన్స్‌లు

జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న భవిత కేంద్రాల ద్వారా సేవలు పొందుతున్న విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు విడుదల చేసింది. నేరుగా అర్హుల బ్యాంక్ ఖాతాల్లో అలవెన్స్‌లు జమ చేసింది. రవాణా, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, గర్ల్ స్టైపెండ్, ఎస్కార్ట్ అలవెన్స్‌ల రూపంలో ప్రభుత్వం ప్రోత్సాహకాలు జమ చేసింది.

– సూర్యారావు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, విజయనగరం

రూ.3 వేలు ఖాతాలో జమ



సంవత్సరం నుంచి మా ప్రణవ్‌కుమార్‌ను భవిత కేంద్రానికి తీసుకొస్తున్నాం. అప్పుడు కంటే ఇప్పుడు మెరుగ్గానే ఉన్నాడు. రోజూ బాబును భవిత కేంద్రానికి తీసుకొస్తున్నందుకు ప్రభుత్వం మా ఖాతాలో రూ.3 వేలు జమ చేసింది. భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు. దీంతో బాటు అలవెన్స్ ఇవ్వడం గొప్ప విషయం.

– కె.సుశీల, చీపురుపల్లి

చాలా మేలు చేస్తున్నారు....



మా బాబు నితిన్‌ను సంవత్సరం నుంచి భవిత కేంద్రానికి తీసుకొస్తున్నాం. ఇక్కడ చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు. తాజాగా మా ఖాతాలో రూ.3 వేలు ప్రభుత్వం జమ చేసింది. భవిత కేంద్రాల ద్వారా చాలా ఉపయోగం ఉంది. మా పిల్లల్లో మంచి మార్పు కనిపిస్తోంది.

– ఎస్.హైమ, వంగపల్లిపేట, చీపురుపల్లి

దర్యాప్తు ముమ్మరం



మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు, ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: మండలంలోని రావివలస పంచాయతీ పంతెమామిడివలసకు వెళ్లే దారిలో సీతగుండమ్మ గుడి వద్ద జరిగిన హత్య కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన సాగి వెంకటరమణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ హత్యకు సంబంధించి సీఐ తిరుమలరావు, ఎస్సై సురేంద్రనాయుడులు మృతుని బంధువులతో మాట్లాడి రెండోరోజు ఆదివారం కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం వెళ్లి వస్తానని చెప్పి వెంకటరమణ ఇంట్లో నుంచి బయటకు వచ్చేశాడు. తర్వాత ఏం జరిగిందో ఏమో గాని మండలంలోని మారుమూల గిరిజన గ్రామంలో మృతి చెంది కనిపించాడు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా పలు కోణాల్లో . అనుమానితులకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

టీవీఎస్‌ను కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయరహదారి, ఘాట్‌రోడ్డుపై ఒడిశా నుంచి సాలూరు వైపు వస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌బండిని, సాలూరు నుంచి ఒడిశా వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో టీవీఎస్ ఎక్సెల్ నడుపుతున్న రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామానికి చెందిన పోతురాజు చిన్నారావు త్రీవగాయాల పాలయ్యాడు. స్థానికులు 108లో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుంప ఆలయం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కాపారపు పొండేషన్ ప్రతినిధి కాపారపు సత్యనారాయణ

- కాపారపు ఫౌండేషన్ ప్రతినిధి

కొమరాడ: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన గుంపస్వామిశ్వర ఆలయాన్ని పార్టీలకు అతీతంగా అందరం కలిసి అభివృద్ధి చేద్దామని కాపారపు పొండేషన్ ప్రతినిధి కాపారపు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన గుంపసోమేశ్వర ఆలయ ప్రాంగణంలో కాపారపు పొండేషన్ ఆధ్వర్యంలో కొమరాడ మండల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీని నియమించారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇంత చరిత్ర కలిగిన దేవాలయానికి ఆలయ అభివృద్ధితో పాటు పునర్నిర్మాణానికి అందం సహకరిస్తామని పేర్కొన్నారు. నాగవళి, జంఝావతి నదుల సంగమం మధ్య నుంచి ఆలయం వద్దకు వెళ్లడానికి కాజ్‌వే నిర్మించాలని, కోటిపాం కొత్త కాలనీ నుంచి ఆలయం వరకు రహదారి అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే దేవాలయం చుట్టుపక్కల రాతి కట్టు నిర్మాణం జరిగితే వరదలు వచ్చినప్పుడు గర్భగుడికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.ఆలయ కమిటీ ట్రస్టు సభ్యులుగా కొనసాగించడానికి రూ.10,116 విరాళంగా ఇవ్వాలని తీర్మానం చేశారు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శీర తిరుపతి రావు, కోటిపాం సర్పంచ్ భర్త సుంకరి వెంకటిరమణ, గంగరేగువలస సర్పంచ్ కోడితిరుపతిలకు ఆలయ అభివృద్ధి బాధ్యతలు అప్పగించడానికి సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనర్దనరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గులిపిల్లి సుదర్శనరావు, కురుపాం మాజీ జెడ్పీటీసీ అందవరపు కోటేశ్వర రావు, సీనియర్ నాయకులు శనపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు, నంగిరెడ్డి మధుసూదనరావు, డాక్టర్ శెట్టి మధుసూదన రావు, వడ్డి గాంధీ, కళ్లికోట సర్పంచ్ దత్తి మురళీకృష్ణ, వన్నాం సర్పంచ్ భర్త మాదలింగి మహిపతినాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

3న అండర్-16 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న అండర్-16 బాలురు, బాలికల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వైట్‌డ్రెస్, సొంత క్రికెట్‌తో పాటు, విజయనగరం జిల్లాలో జన్మించిన జనన ధ్రువీకరణపత్రం, ఇదే జిల్లాలో చదువుతున్న స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు, జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా క్రీడాకారులు 2007 సెప్టెంబర్ 1 నుంచి 2009 ఆగస్టు 31 లోపు జన్మించిన వారు పోటీలకు అర్హులన్నారు. పోటీలకు ఎంపికైన బాల బాలికలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9666818126 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శంకరాచార్యుల సాహిత్యం నేటితరానికి ఎంతో ఉపయోగం



కట్టమూరి చంద్రశేఖరమ్‌ను సత్కరిస్తున్న విజయభావన సాహితీ సమాఖ్య ప్రతినిధులు

- శ్రీ సూర్యసదన ఆస్థాన పండితుడు డాక్టర్ కట్టమూరి

విజయనగరం టౌన్: నేటితరానికి శంకరాచార్యుల సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుందని శ్రీ సూర్యసదన ఆస్థాన పండితుడు డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం పేర్కొన్నారు. విజయభావన సాహితీ సమాఖ్య 520వ సభ శ్రీ శంకర సాహితీ వైభవం అనే అంశంపై స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో వక్తగా పాల్గొన్న ఆయన జగద్గురు శ్రీ శంకరుల సాహితీ వైభవం అనే అంశంపై ప్రసంగించారు. జగద్గురుపై బాలల నుంచి వృద్ధుల వరకూ తప్పనిసరిగా అధ్యయనం చేయాలని సూచించారు. శంకరాచార్యుల సౌందర్యలహరి, కనకధారాస్తవం, భజగోవిందం శ్లోకాలు రాగయుక్తంగా ఆలపించి ఆహూతులను ఆనందింపజేశారు. శంకరమఠం అధ్యక్షుడు జీఎస్ఏ.నరసింహం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు స్వీయ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో మహారాజా మహిళా కళాశాల విశ్రాంత ప్రాచార్యులు కె.లలితాశంకర్, డాక్టర్ జక్కు రామకృష్ణ, భోగరాజు సూర్యలక్ష్మి, శిరీష రఘురాం, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, నేమాని పట్టాభిరామం, దామరాజు శంకరం తదితరులు పాల్గొన్నారు.

ఆటందం నీ హద్దురా..!

- నేటినుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం
- నెలాఖరు వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు



వాలీబాల్ ఆటలో క్రీడాకారులు (ఫైల్)



కబడ్డీలో విద్యార్థినులు (ఫైల్)

పార్వతీపురంటౌన్/విజయనగరం ఫోర్ట్: వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులకు పండగే. పుస్తకాలతో కుస్తీపట్టిన వారు ఒక్కసారిగా రెక్కలు వచ్చి సంతోషంతో విహరించనున్నారు. వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపేద్దామని ఎదురు చూస్తున్న విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు క్రీడా ప్రాధికార సంస్థ ముందుకొచ్చింది. నెల రోజుల పాటు 18 రకాల ఆటలపై శిక్షణ ఇచ్చేందుకు షెడ్యూల్ ప్రకటించింది. క్రీడల పట్ల ఆసక్తి, నైపుణ్యం పెంచడం, ప్రతిభను వెలికితీయడం, శారీరక, మానసికోల్లాసం కల్పించడం వేసవి శిబిరాల ప్రధాన లక్ష్యం. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుంది. ఆటల్లో మరింత నైపుణ్యం సాధిస్తారు. క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

శిక్షణ పరికరాలు సిద్ధం

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 50 ప్రాంతాల్లో 18 రకాల ఆటలకు శిక్షణ ఇస్తారు. సోమవారం 31వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 6గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు. ఈ మేరకు సంబంధిత ప్రాంతాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు, పలు క్రీడాసంఘాల ప్రతినిధులు ఆసక్తిగా ముందుకొచ్చారు. శిక్షణకు అవసరమైన పరికరాలను తెప్పించేందుకు క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కోచ్‌లను సిద్ధం చేశారు. శిబిరాల వద్ద మౌలిక వసతులు ఉండేలా చూస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో శిక్షణ కేంద్రాలు

బాక్సింగ్: చర్చి వీధి, కాలేజీగ్రౌండ్ పార్వతీపురం

ఖోఖో: జెడ్పీహెచ్ఎస్ పాలకొండ

వెయిట్ లిఫ్టింగ్: ప్రభుత్వ జూనియర్ కళాశాల పార్వతీపురం

బ్యాడ్మింటన్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం, వసుంధరానగర్ పార్వతీపురం

కరాటే: ఎలక్ట్రికల్ కార్యాలయం పార్వతీపురం, జెడ్పీహెచ్ఎస్ బందలుప్పి, జెడ్పీహెచ్ఎస్ కురుపాం, జెడ్పీహెచ్ఎస్ మామిడిపల్లి, జెడ్పీహెచ్ఎస్ పెదబొండపల్లి, టీడబ్ల్యుడే హెచ్ తోణాం, ప్రియదర్శిని స్కూల్ నర్సిపురం, జెడ్పీహెచ్ఎస్ మార్కొండపుట్టి

హ్యాండ్‌బాల్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం, జెడ్పీహెచ్ఎస్ ఎమ్మార్‌నగరం, జెడ్పీహెచ్ఎస్ నర్సిపురం

చదరంగం: జెడ్పీహెచ్ఎస్ నర్సిపురం

అథ్లెటిక్స్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాలకొండ, జెడ్పీహెచ్ఎస్ గాదెలవలస

ఫెన్సింగ్: ఆర్‌సీఎం పాఠశాల పార్వతీపురం, ఏకే అకాడమీ పార్వతీపురం కబడ్డీ: జీడీసీ గ్రౌండ్ పాలకొండ

త్వైకాండో: జీజే కాలేజీ పార్వతీపురం, సాయిరాంనగర్ పార్వతీపురం, ఎంపీయూపీ జగన్నాథపురం, ఎంపీయూపీ కృష్ణపల్లి, జెడ్పీహెచ్ఎస్ నర్సిపురం, కిశోర్‌చంద్రదేవ్ పాఠశాల కురుపాం

ఆర్చరీ: మినీ స్టేడియం సీతానగరం, బాలికల ఉన్నత పాఠశాల పార్వతీపురం

వాలీబాల్: జీడీసీ గ్రౌండ్ పాలకొండ, హెచ్ఎస్ గ్రౌండ్స్ దోనుబాయి, జెడ్పీహెచ్ఎస్ పార్వతీపురం, జెడ్పీహెచ్ఎస్ తోటపల్లి

యోగా: రిషి యోగా సెంటర్ పాలకొండ, జీడీసీ గ్రౌండ్ పాలకొండ, ప్రభుత్వ బాలుర పాఠశాల పార్వతీపురం, సూర్య యోగా సెంటర్ పార్వతీపురం, కేఎస్ యోగా సెంటర్ పార్వతీపురం, జెడ్పీహెచ్ఎస్ ఎమ్మార్‌నగరం

క్రికెట్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం

ప్రతిభ కనబరిచిన వారికి గుర్తింపు



శిక్షణ శిబిరాల్లో ప్రతిభ కనబరచిన వారికి గుర్తింపు ఉంటుంది. సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఆదేశాలు అందాయి. అందులో భాగంగా క్రీడల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ కూడా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి వచ్చింది. శిక్షకులకు అందిస్తాం. శిక్షణ ముగిసిన అనంతరం శిక్షణార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేస్తాం.

– ఎస్ వెంకటేశ్వరరావు, జిల్లా చీఫ్ కోచ్, పార్వతీపురం మన్యం

సద్వినియోగం చేసుకోవాలి



విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఉచితంగా 50 ప్రాంతాల్లో క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నాం. క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు రూ.3.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, శిబిరాల ప్రారంభోత్సవం, ముగింపు ఉత్సవాలకు ఈ నిధులు వినియోగించాల్సి ఉంటుంది.

– బి.రామ్‌గోపాల్, సెట్విజ్ సీఈఓ, విజయనగరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ
బహిరంగ వేలం - కం- సీల్డు - టెండర్ ప్రకటన

Rc.No.2/2023 ; dt:29-04-2023

1) పార్వతీపురం మన్యంజిల్లా - గరుగుబిల్లి మండలం - తోటపల్లి గ్రామం యందు వేంచేసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వేంకటేశ్వర మరియు శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానములు వారి హక్కు భుక్తములోని తోటపల్లి, గంగరాజుపురం, పెదకుదమ, నందివానివలస, గౌరీపురం, సంకి గ్రామములలో గల విస్తీర్ణం ఏ-7-49సెం. వ్యవసాయ భూములను సాగు నిమిత్తం అప్పగించిన తేదీ నుండి మూడు సంవత్సరముల కాలమునకు బహిరంగ వేలం.

2) శ్రీ స్వామి వారికి భక్తులుచే సమర్పించి వదలి వేయబడిన తలనీలాలు 1సంవత్సరము కాలం స్వయముగా ప్రోగు చేసుకొని పోవుట గూర్చి.

3) శ్రీ స్వామి వారికి భక్తులచే సమర్పించి వదలి వేయబడిన తలనీలాలు మరియు దేవస్థానముచే ప్రోగుచేయబడిన తలనీలాలు అన్ని సైజులు కలుపుకొని సుమారు 113కేజిలుకు టెండర్ - కం-బహిరంగవేలం పాట.

4) శ్రీస్వామి వారికి భక్తులుచే సమర్పించి వదలి వేయబడిన కొబ్బరి చెక్కలు 1సంవత్సరము కాలంనకు స్వయముగా ప్రోగు చేసుకొని తీసుకొనిపోవు లైసెన్సు హక్కులకు బహిరంగ వేలం నిర్ణయించవైనది. సదరు వేలం పాటలు తే 17-05-2023దీన దేవస్థానం ప్రాంగణములో జరుగును. మిగిలిన వివరములు కొరకు దేవస్థానం కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

సంప్రదించు ఫోన్ నెం.9573456699, 7386138121

సం/-బుద్ధ మహాలక్ష్మి నగేష్, కార్యనిర్వహణాధికారి

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

Deluxe 2 B/R, Car Park, Loan Can be Arranged 100% Vastu @ R&B Guest House Road, Alakanandha Colony, VZM. Ph : 63035 11633, 92466 24248 [V-776931]

PLOT FOR SALE

కేవలం 6.5 లక్షలకే 117గ॥ స్థలం+విత్ రిజిస్ట్రేషన్ అప్రూవ్డ్ లేవుట్ హిల్ వ్యూ అలాగే ప్రహరి గోడ 3ఫేస్ పవర్ బ్లాక్ టాప్ రోడ్స్ ఒపెన్ డ్రైన్స్ వెంటనే ఇల్లు కట్టుకోవడానికి అనువుగా మరియు ఆహ్లాదకరమైన వాతావరణం విజయనగరానికి అతి సమీపంలో. సెల్:9143143818 [S-1154292]

5 లక్షలకే 111 చ॥గ॥లు GVMC 77వ వార్డులో స్టీల్‌ప్లాంట్‌కి 7 కి.మీ.లో ప్లాట్స్ అమ్మకానికి కలదు. స్పాట్ రిజిస్ట్రేషన్, EMI కలదు. ఫోన్: 73864 14017 [V-794456]

BUSINESS OFFER

అద్భుత వ్యాపార అవకాశం! గ్యాస్ ప్రమాదాలను అరికట్టే సేఫ్టీ డివైస్ ప్రమోట్ చేస్తూ రో॥ 5000/- వరకు సంపాదించే అవకాశం, ఏరియా వైజ్ ఫ్రాంఛైజీలకై సంప్ర: 9100532959 [H-797452]

WANTED

ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786210]

ఫ్రాంఛైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మా సంస్థను మీ జిల్లాలో అభివృద్ధి చేయగలవారు కావలెను. Mega Group Man Power & Security. 7032610569, 7093125169. [NA-5527]

ఇంటిపని, వంటపని విజయవాడలో ఉండి పనిచేయుటకు ఏ బాదర బందీలేని ఆడపనివారు కావలెను. ఉచిత వసతి + జీతం : 12,000 ✆ 99662 28370 [B-1165880]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793419]

VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995984445 [HA-114]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.